30 నుంచి సమ్మర్ క్యాంప్

నిజాంపేట్: ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుండి మే 9వరకు పది రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్ వేదికగా ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు జరిగే సమ్మర్ క్యాంప్‌లో కథలు విందాం.. చెబుతాం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, టీమ్ యాక్టివిటీస్, ఫన్ మ్యాథ్స్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, సీపీఆర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, మీట్ ది సైంటిస్ట్, ఫీల్డ్ ట్రిప్, పాత, కొత్త ఆటలు వంటివి నిర్వహించనున్నారు. 5వ తరగతి నుండి 9 వరకు చదివే విద్యార్థులు ఈ నెల 29వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని, రూ.150 నామమాత్రపు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 7416500946 /7416500947 నంబర్లలో సంప్రదించండి.

26 నుంచి సైన్స్ శిబిరం

ఏప్రిల్ 26 నుండి మే 2వ తేదీ వరకు ప్రగతినగర్‌లోని సుందయ్యభవన్‌లో జనవిజ్ఞాన వేదిక బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఉచిత సైన్స్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. శిబిరంలో పాలుపంచుకునే వారు 9348581007, 9959063742 నెంబర్లలో సంప్రదించాలి.

తెలుగు కేలండర్ ఆవిష్కరణ

మోతీనగర్: ఆంగ్లం మోజులో పడి నేటి విద్యార్థులకు తెలుగు సంప్రదాయం, పండుగలు, పద్ధతులు మర్చిపోతున్న తరుణంలో మూసాపేట డివిజన్ అవంతినగర్‌తోటకు చెందిన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, సభ్యులు టీవీ సుబ్బారావు, సుభాష్ పాటిల్, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి స్వచ్ఛమైన తెలుగు ఉగాది నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు తెలుగు భాష పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తెలుగులో అవంతినగర్ తోట కాలనీకి సంబంధించిన సమాచారంతో పాటు కాలనీలో ఉన్న ఆలయాలకు సంబంధించి ముద్రించారని తెలిపారు.

ఏళ్లు గడుస్తున్నాయ్..

అందుబాటులోకి రాని 'అభివృద్ధి'



జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనం.. నిర్మించి 12 ఏళ్లు (ఫైల్)

రాయదుర్గం: అభివృద్ధి పనుల్లో జాప్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది.. నిధుల లేమి, నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులు.. ఏళ్లు గడిచినా, కోట్ల రూపాయలు వెచ్చించినా తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందా...అని ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

- గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి తండాలోని మినీ మహాప్రస్థానం పనులకు పదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. పనులు మధ్యలో ఆగిపోయాయి.
- గోపన్‌పల్లితండాలో ఆధునిక తరహాలో మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్ కమ్ ఫంక్షన్ హాల్ నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొంది. పదేళ్ల క్రితం శంకుస్థాపన చేసి, ఇటీవలే ప్రారంభించినా ఇంకా పనులు పూర్తికాలేదు
- ఏడేళ్ల క్రితం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో నుంచి నల్లగండ్ల, గోపన్‌పల్లి మీదుగా వట్టినాగులపల్లి వరకున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు.
- 2012లో శంకుస్థాపన చేసిన ఖాజాగూడ మినీ స్టేడియం పరిస్థితి ఇంతే. ఇండోర్ స్టేడియం నాలుగేళ్ల క్రితం ప్రారంభించినా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.
- ఇక ఔట్‌డోర్ స్టేడియం కూడా అభివృద్ధి చేయాలని తలపెట్టినా ఆ ప్రతిపాదన అలాగే ఉంది.
- గత ఏడాది రూ 3 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసిన ఖాజాగూడ మినీ మహాప్రస్థానం తరహాలో నిర్మించదలచిన శ్మశాన వాటిక పనులు జరగడం లేదు.
- ఖాజాగూడలో ఆరేళ్ల క్రితం రూ.45 కోట్లతో ప్రారంభించిన 8 లేన్ల మోడల్ రోడ్డు కాస్తా ఆరు లేన్లకే పరిమితం చేసి ఇరువైపులా సర్వీస్‌రోడ్డు, డ్రైనేజీ, డక్ట్ వంటివి ప్రతిపాదనలకే పరిమితం చేశారు.
- రాయదుర్గంలోని శ్మశానవాటిక అభివృద్ధి కోసం గత పదకొండేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ రూ.65 లక్షలతో శ్మశానవాటికలను ఆధునీకరిస్తామని చెప్పినా ఇప్పటికీ ఎలాంటి పనులు ప్రారంభించలేదు.
- ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా రూ.50 కోట్లతో ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన వైట్‌టాపింగ్ రోడ్డు విప్రో సర్కిల్ వరకు ఒకవైపు మాత్రమే పూర్తి చేసి మిగతా పనులు, మరో వైపు చేయాల్సిన పనులు ఇప్పటికీ ఆరంభించలేదు.
- 2012లో కేశవనగర్‌లో రాజీవ్ ఆవాస్ యోజన గృహ నిర్మాణానికి శంకుస్థాపన, ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేసినా ఆచరణకు నోచుకోలేదు
- 12 ఏళ్ల క్రితం గౌలిదొడ్డి బ్లడ్ బ్యాంక్ పనులు కొంత వరకు చేసి నిలిపివేశారు.
- టీఎన్‌జీఓ కాలనీలో 8 ఏళ్ల క్రితం నిర్మించినా ఇప్పటికీ అందుబాటులోకి రాని మోడల్ మార్కెట్
- డివిజన్ పరిధిలో పలు చెరువుల సుందరీకరణకు శంకుస్థాపనలు చేసినా ఇప్పటి వరకు పనులు కూడా ప్రారంభం కాలేదు. కొన్నింటికి పనులు మొదలుపెట్టి మధ్యలో ఆపేశారు.



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో మరోవైపు వైట్ టాపింగ్ వేయని ప్రధాన రోడ్డు ఇదే..



మోడల్ మార్కెట్ భవనం.. నిర్మించి 8 ఏళ్లు (ఫైల్)

ప్రభుత్వం దృష్టికి తెస్తాం



గచ్చిబౌలి డివిజన్‌లో పెండింగ్ పనులన్నింటికీ నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాం. గచ్చిబౌలి డివిజన్‌ను సమస్యలు లేని ప్రాంతంగా మార్చడమే లక్ష్యం. అవసరమైన నిధుల కోసం అన్ని విధాల చిత్తశుద్ధితో కృషి చేస్తాం.

– గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్, గచ్చిబౌలి డివిజన్

నిధులు మంజూరు చేయించేలా..



సమస్యను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళతాం. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించేలా చూస్తాం.

– సాయిబాబా, మాజీ కార్పొరేటర్, గచ్చిబౌలి డివిజన్

ఆస్తిపన్ను మదింపు అక్రమాలపై విచారణ జరపాలి



జెడ్సీ స్నేహకు వినతిపత్రం అందజేస్తున్న నాయకుడు శోభన్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను మదింపు వ్యవహారంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు సీపీఐ (ఎం) నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. సీపీఐఎం శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి సి.శోభన్, మెంబర్ కృష్ణలు డైమండ్ హిల్స్‌లోని వాణిజ్య సంస్థలు ఆస్తి పన్ను మదింపులో అనేక అక్రమాలు జరిగాయన్నారు. సర్కిల్ పరిధిలోని అనేక వాణిజ్య సంస్థలకు చెందినవి ఇదే కోవలోకి వస్తాయని, వాటిపై విచారణ జరిపితే కోట్లాది రూపాయల ఆదాయం జీహెచ్‌ఎంసీకి వస్తుందని వివరించారు. విచారణతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వేదాంత సభ

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠంలో ఈ నెల 27 నుంచి 29 వరకు బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన 64వ శృంగేరి శారదాపీఠ సపరికరాద్వైత వేదాంత సభ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు మఠం కార్యనిర్వహణాధికారి సిఎస్ఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ధార్మిక ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

29న నిధి ఆప్‌కే నిఖత్

మూసాపేట: కూకట్‌పల్లిలో ప్రావిడెంట్ ఫండ్ (పియఫ్) కార్యాలయంలో నిధి ఆప్‌కే నిఖత్ నిర్వహించనున్నట్లు పియఫ్ కమిషనర్ డా. హేమంత్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లిలో ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో గల రెండవ అంతస్థులోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో, నాసెన్స్ లాబ్ ప్రైవేట్ కంపెనీ, జీడిమెట్లలో ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాక, సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్ లింగంపల్లి, బీహెచ్‌ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్‌ల ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

కాసాని జ్ఞానేశ్వర్‌కు భారీ మెజార్టీ అందించాలి

ఆల్విన్‌కాలనీ:చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు గురువారం శ్రీ పంచముఖ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాప్‌లపై దాడులు నిర్వహించి 85 లీటర్ల మద్యంను అమీన్‌పూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణి నగర్ కాలనీ కూల్‌డ్రింక్ షాప్‌లో,ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని గురువారం సమాచారం రావడంతో ఎస్‌ఐ సోమేశ్వరి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు చోట్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.45 వేలు ఉంటుందన్నారు. మద్యం విక్రయిస్తున్న రంగ, దుర్గారెడ్డిలపై కేసు నమోదు చేశారు.

సమీక్ష

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం-52 వ్యయ పరిశీలకులు, ఏఆర్‌ఓ అధికారి సెంథిల్ కుమార్ గురువారం ఏఆర్‌ఓ కార్యాలయంలో నోడల్ అధికారుల బృందంతో సమీక్ష నిర్వహించారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, అకౌంటింగ్ బృందాలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ, జడ్సీ స్నేహ శబరీష్, ఈఆర్‌ఓ రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఓటు వేయాలి

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరు విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. గురువారం టింబర్ లేక్ కాలనీ, నోవాటెల్, సుదర్శన్‌నగర్‌లో లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, పీఓ ఉమారాణి ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటింగ్‌కు దూరంగా ఉండటం తగదని అధికారులు సూచించారు. ఓటింగ్ శాతం పెంచుతామని ప్రతిజ్ఞ చేయించారు.

ఎర్లీబర్డ్‌కు విశేష స్పందన

శేరిలింగంపల్లి సర్కిల్‌లో రూ.69 కోట్లు వసూలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ప్రాపర్టీ ట్యాక్స్ రూ. 69 కోట్లు వసూలైంది. ఈ ఏడాది (2024-25)కి సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. కాగా గురువారం రూ.4.50 కోట్లు వసూలైనట్లు డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రకటించిన ఎర్లీబర్డ్ స్కీంకు భవన యజమానుల నుంచి స్పందన బాగుందన్నారు. ఆదివారం కూడ ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించేందుకు సర్కిల్ కార్యాలయంలో సిటిజన్ సర్వీస్ సెంటర్ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగారంలో బీజేపీ ప్రచారం



ప్రచారంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రవికుమార్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: అభివృద్ధి జరగాలంటే నరేంద్రమోడీని గెలిపించాలని బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం రాత్రి చందానగర్‌లోని గంగారంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా సమస్యలు తెలుసుకుని గెలిచిన అనంతరం వాటిని పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం చెందిందని, బీఆర్‌ఎస్ పార్టీ పోటీలో ఉన్నా లేనట్లేనని, అందుకే బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



నాయకులు, అధికారులతో సమావేశమైన వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

ఏఆర్‌ఓ, జడ్సీ స్నేహ శబరీష్

గచ్చిబౌలి: ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, ఆయా పార్టీల నాయకులు సహకరించాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏఆర్‌ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ కోరారు. గురువారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. తాజా ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు అందజేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల సంఖ్య, బూత్‌లెవల్ ఆఫీసర్ల ఫోన్ నెంబర్లలో మార్పులు ఉంటే ఆయా పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని చెప్పారు. ఇంటింటికి ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం మే 3, 4 తేదీలలో ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ర్యాలీలు, సభలు, సమావేశాల అనుమతుల కోసం రాజకీయ పార్టీలు రూట్ మ్యాప్ సమర్పించి పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ రజనీకాంత్ రెడ్డి, మాదాపూర్ ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్, నోడల్ ఆఫీసర్లు మల్లిఖార్జున్, గణపతి, సర్కిల్ ఏసీపీ మెహ్రా, కాంగ్రెస్ నాయకులు శ్రీహరి గౌడ్, బీజేపీ నాయకులు జగదీష్, సీపీఎం నాయకులు శోభన్, సీపీఐ(ఎం) నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయదుర్గంలో ఎమ్మెల్యే పర్యటన

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌రాయదుర్గంలో శుక్రవారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలను నిర్వహించి ఎమ్మెల్యే గాంధీ ప్రచారాన్ని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు సాయిసంస్థాన్ వార్షికోత్సవం

మణికొండ: నార్సింగి సాయి సంస్థాన్ ఆలయం 17వ వార్షికోత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.వినోద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుంచి సాయంత్రం వరకు అభిషేకం, అర్చన, హారతి, పల్లకీ సేవ ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న ప్రసాదం పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు.

'మనూ'లో అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. యూనివర్సిటీలోని బీఏ, బీఈడీ, బీఎస్సీ, బీకామ్ నాలుగు ఏళ్ళ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు (ఐటీఈపీ) అభ్యర్థుల కోసం జాతీయ సాధారణ ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) ద్వారా కొత్త విద్యావిధానం-2020కి అనుగుణంగా అడ్మిషన్లుకు ఏర్పాట్లు చేశామన్నారు.అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఈడీ, బీఎస్సీ, బీకామ్ ఇంటిగ్రేటెడ్ కోర్సులలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్‌ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించడం జరుగుతుందని వివరించారు. వివరాలకు ఫోన్ నంబర్లు 6207728673, 6302738370లలో సంప్రదించాలని కోరారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



శివమ్మ బస్తీ కాలనీవాసులతో సమావేశమైన కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శివమ్మ కాలనీ అసోసియేషన్ సభ్యులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మ్యాన్‌హోల్ మురుగునీటి సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా మ్యాన్‌హోల్స్ లోపల వైపు సిమెంట్ ప్లాస్టింగ్ చేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు కాయితి నరసింహులు, గౌరవ అధ్యక్షులు సిద్ధయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: ఇంటింటి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని, ప్రతి ఓటరును కలవాలని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సూచించారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు రోజూ ఉదయం ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసేలా చూడాలన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సామూహికంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి కాలనీ, బస్తీలో ప్రచారం చేయాలని నిర్ణయించారు. నాయకులు, కార్యకర్తలు మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మిస్ ప్రజ్ఞా అయ్యగారి, నిర్వాహకుడు డొమినిక్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో గురువారం హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను మిస్ సుప్రనేషనల్ ఏసియా 2023 ప్రజ్ఞా అయ్యగారి, నటీమణులు అమిక్ష, స్రవంతి, ప్రీతి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో నగరవాసులను ఆకట్టుకునే వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

సమర్థుడైన వెంకట్రాంరెడ్డికి పట్టం కట్టండి...

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సమర్థుడు, పరిపాలన అనుభవం కలిగిన వెంకట్రాంరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్ నివాసంలో గురువారం స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మున్సిపల్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ నెల 28న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన అమీన్‌పూర్ మున్సిపల్ మరియు మండల స్థాయి మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు.ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వారి అమలులో విఫలం చెందుతున్న తీరును ప్రజలకు వివరించాలని కోరారు. మెదక్ లోక్ సభ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. తాను పటాన్‌చెరు నియోజకవర్గ ప్రాంతానికి చెందిన వాడిని.. తనను గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, బాల్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



రిక్షాపుల్లర్స్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారంలో భాగంగా వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీ, పలు కాలనీల్లో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని, కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా, బస్తీ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.



రద్దీలేని కేబీఆర్ పార్కు జంక్షన్



నిర్మానుష్యంగా ఉన్న తెలంగాణ భవన్ రోడ్డు

ఎండలు బాబోయ్.. ఎండలు

ఎండలు మండిపోతుండడంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని ప్రధాన రహదారులన్నీ ఉదయం 11.30 గంటల తర్వాత నిర్మానుష్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా మిట్ట మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. భానుడి ప్రతాపానికి నగరవాసులు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మరోవైపు జలమండలితో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి.

– బంజారాహిల్స్